# అభ్యర్థుల ఎన్నికల ఖర్చును నమోదు చేయాలి

- పర్యవేక్షణ లోపం లేకుండా చూడాలి
- వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలి
- అనుమతి లేని వాహనాలు వాడొద్దు
- ములుగు ఎన్నికల వ్యయ పరిశీలకుడు వాగీశ్ కుమార్ సింగ్
- ఎన్నికల అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వాగీశ్ కుమార్, పక్కన, కలెక్టర్ త్రిపాఠి, రిటర్నింగ్ అధికారి అంకిత్, ఎస్పీ గౌస్ ఆలం

ములుగు టౌన్, నవంబర్ 3 : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను నామినేషన్ వేసినప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు వ్యయ పరిశీలన బృందాలు నమోదు చేయాలని ములుగు ఎన్నికల కమిషన్ వ్యయ పరిశీలకుడు వాగీశ్‌కుమార్ సింగ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో కలెక్టర్, ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి, ఎస్పీ గౌస్ ఆలం, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి వాగీశ్ కుమార్ సింగ్ జిల్లా ఎన్నికల పర్యవేక్షణ నోడల్ అధికారులు, నియోజకవర్గ సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారి విధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వేలైన్స్, వీడియో పరిశీలన, అకౌంటింగ్ టీమ్‌ల సభ్యులు జిల్లాలో సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించేలా చూడాలని ఆదేశించారు. అభ్యర్థుల ఆమోద యోగ్యం కాని ఖర్చుల వివరాల నమోదు ప్రక్రియను చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటిని వీడియో సర్వేలైన్స్ టీమ్ రికార్డింగ్ చేసి వీడియోను పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీమ్ సభ్యులకు సమన్వయం చేసుకోవాలన్నారు. అకౌంటింగ్ టీమ్ వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. అభ్యర్థుల ప్రచార ఖర్చుల అకౌంట్లు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ఖర్చులను నామినేషన్ వేసిన తర్వాత ఎన్నికల సందర్భంగా, ఎన్నికల అనంతరం పరిశీలన చేయనున్నారని, పరిశీలనకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ ఉపయోగించిన ఖర్చులు నమోదు చేసి వాటి అనుమతి రద్దు చేయాలన్నారు. ఒకరు అనుమతి తీసుకున్న వాహనం వేరే అభ్యర్థి ఉపయోగించరాదన్నారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినప్పుడు ప్రింటర్, ప్రచురణకర్తలు నిబంధనలు పాటించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల్లో ప్రకటనలు జిల్లా మీడియా, మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్లను ప్రలోభ పరిచేలా డబ్బు, మద్యం పంపిణీపై ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఎస్ఎస్‌టీలు పకడ్బందీగా తనిఖీ నిర్వహించాలన్నారు. కానుకలు పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యయ పరిశీలన కమిటీ నోడల్ అధికారి జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, సహాయ వ్యయ, రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డీ వేణుగోపాల్, డీఎస్ వెంకన్న, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి సర్దార్ సింగ్, ఎక్సైజ్ అధికారులు లింగాచారి, సుధీర్ కుమార్, సహా య వ్యయ పర్యవేక్షకులు, అకౌంట్ అధికారులు పాల్గొన్నారు.

### కంట్రోల్ రూం పరిశీలన

కలెక్టరేట్ కార్యాలయ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. 24 గంటలు పని చేసే ఫిర్యాదుల కేంద్రం, సీ విజిల్, కంట్రోల్ రూం 1950 సేవలు సమర్థంగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ములుగురూరల్ : ఎన్నికల కోరంకు అభ్యర్థులు నామినేషన్ ఖాతాలు చేసినప్పుడు ఆర్వో ప్రతి డాక్యుమెంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు వాగీశ్ కుమార్ సింగ్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నామినేషన్ నాటి నుంచి అభ్యర్థుల ఖర్చులను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. సంబంధిత రికార్డుల నిర్వహణ ఎన్నికలు ముగిసే వరకు కొనసాగించాలన్నారు. పార్టీలకు చెందిన వారి ఖర్చులను పార్టీ పేరుతో ఏర్పాటు చేసి రిజిస్టర్‌లో, ఇండిపెండెంట్ అభ్యర్థులకు సంబంధించిన ఖర్చులను షాడో రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు 2బీలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఉచితంగా అందించాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు జాబితాలను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌ల ద్వారా అభ్యర్థులు పరిశీలించుకోవడానికి వీలుగా పోలింగ్ కేంద్రం వారీగా జాబితాను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నామినేషన్ నమోదులో అభ్యర్థులకు సిబ్బంది సహకరించి ప్రతి కాలమ్ నింపేలా చూడాలన్నారు. ఒకవేళ ఏదైనా కాలమ్‌లో చెప్పాల్సింది ఏమి లేనప్పుడు 'లేదు.. వర్తించదు'.. అని కచ్చితంగా రాసేలా చూడాలన్నారు. సెక్యూరిటీ డిపాజిట్ అనంతరం రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి నామినేషన్ పత్రాలను సమర్పించినప్పుడు ఆనెగ్జర్-19 ఫార్మాట్ -26, అఫిడవిట్, బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ, ఫొటోలు, ఇతర నియోజకవర్గానికి చెందిన వారైతే వారి ఓటు వివరాలు తెలిపే సర్టిఫైడ్ కాపీ, అభ్యర్థి పోటీ చేసే పార్టీ గుర్తులను తెలియజేశారా ? లేదా ? చూడాలన్నారు. నామినేషన్ స్వీకరణ అనంతరం స్క్రూటినికి సమయాన్ని అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళి వివరాలను తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు డీ వేణుగోపాల్, డీఎస్ వెంకన్న, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి సర్దార్‌సింగ్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు, వృద్ధులు ఓటుహక్కును వినియోగించుకోవాలి

**జడ్పీ సీఈఓ విజయలక్ష్మి**

కృష్ణకాలనీ, నవంబర్ 3 : రాష్ట్రంలో ఈ నెల 30న నిర్వహించే సాధారణ ఎన్నికల్లో జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు ఓటుహక్కును వినియోగించుకోవాలని జడ్పీ సీఈఓ విజయలక్ష్మి సూచించారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఈరెల్లి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ఓటు హక్కు వినియోగం, సంకల్ప్ యాప్‌పై అవగాహన కల్పించారు. తామంతా ఓటు హక్కు వినియోగించుకుంటామని దివ్యాంగులు, వృద్ధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ మాట్లాడుతూ ఓటుహక్కు రాజ్యాంగం మనకిచ్చిన హక్కు అని, దానిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల యంత్రాంగం అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సీడీపీవో అవంతి, భారత జాగృతి దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కుమారస్వామి గౌడ్, దివ్యాంగుల సంఘం నాయకులు గుండెబోయిన నీలాంబరం, జిట్టబోయిన ప్రశాంత్, ముదురుకోళ్ల నర్సయ్య, కొండ సారయ్య, వృద్ధులు సమ్మయ్య, చంద్రయ్య, వెంకటయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఓటు హక్కు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈఓ విజయలక్ష్మి

# ఎన్నికల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

- నగదు, వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలి
- పేడ్ న్యూస్‌పై దృష్టి సారించండి
- భూపాలపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకుడు కౌశిక్‌రాయ్

భూపాలపల్లి రూరల్, నవంబర్ 3: అభ్యర్థుల ఎన్నికల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని భూపాలపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకుడు కౌశిక్ రాయ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కౌశిక్ రాయ్, కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రాతో కలిసి ఎన్నికల వ్యయ వివరాల నమోదుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల నమోదు కోసం ఏర్పాటు చేసిన బృందాలు, వాటి పని తీరు, తదితర అంశాలను ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకుడు కౌశిక్‌రాయ్ మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుల నమోదు కోసం ఏర్పాటు చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు, వీడియో సర్వే లైన్స్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో నగదు, బంగారం వస్తువుల పంపిణీ జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయి నుంచి వచ్చే ఫిర్యాదులు, సమాచారం తీసుకుంటూ పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. సహాయ వ్యయ పరిశీలన, రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అనుమానస్పద బ్యాంకు లావాదేవీలు, రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు జమ, ఉపసంహరణ, ఆన్‌లైన్ ద్వారా మల్టీపుల్ లావాదేవీలపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇన్‌కంటాక్స్, వాణిజ్య పన్నులు, వ్యయ పరిశీలన శాఖలు ఎన్నికల వ్యయ నమోదులో సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా దినపత్రికలు, లోకల్ ఛానల్‌లో వచ్చే పేడ్ న్యూస్‌పై దృష్టి సారించాలని, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. రాజకీయ సభ్యులు సమావేశాలు నిర్వహించే సమయంలో వాటిని రికార్డు చేయాలని, ప్రతి వస్తువు చార్జి ప్రకారం అభ్యర్థి ఎన్నికల ఖాతాల్లో నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ రాములు, ఐటీ అధికారులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు కౌశిక్‌రాయ్, చిత్రంలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా

# నమ్మించి.. వంచించి..

- రూ. కోటీతో ట్రాన్స్‌జెండర్ ఉడాయింపు

తాడ్వాయి, నవంబర్ 3 : నమ్మకంగా ఉంటూ వారికి సహాయం చేస్తూ వారి నుంచి రూ. కోటీ వరకు అప్పు చేసి ఓ హిజ్రా టోకరా పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని కొత్తూరు గ్రామంలో అంజలి అనే హిజ్రా ఒక ఇంటిని అద్దెకు తీసుకుని మూడు సంవత్సరాలుగా జోస్యం చెబుతూ జీవనం సాగించింది. తన వద్దకు పూజల కోసం వచ్చిన వారి నుంచి మేకలు, కోళ్లను బలివ్వాలంటూ తీసుకుని వాటి మాంసాన్ని ఇంటి చుట్టు పక్కల వాళ్లకు ఉచితంగా పంచేది. పలువురు తెచ్చిన కూరగాయలు కూడా అందరికి ఇస్తూ ఉండేది. స్థానికులతో పాటు అంజలి వద్దకు వచ్చిన వారి నుంచి అధిక వడ్డీ చెల్లిస్తానని డబ్బులు అప్పుగా తీసున్నది. ముందుగా కొద్ది మొత్తంలో తీసుకుంటూ చెల్లిస్తూ వారి వద్ద నమ్మకాన్ని పెంచుకుంది. దీంతో బాధితులు లక్షల్లో అప్పు ఇచ్చారు. ములుగుకు చెందిన ఓ వ్యక్తి హిజ్రా చేసిన పూజల వల్ల మంచి జరిగిందని నమ్మి బంగారు చైన్, ఉంగరం బహుమతిగా ఇచ్చాడు. అతడి వద్ద రూ. 15లక్షల అప్పు తీసుకుంది. బాధితుడు డబ్బు ఇవ్వాలంటూ ఒత్తిడి తేవడంతో అంజలి బుధవారం ఉడాయించింది. రెండు రోజులుగా అంజలి కనిపించకపోవడంతో బాధితులు లబోదిబో అంటూ పోలీస్‌స్టేషన్‌కు క్యూ కడుతున్నారు. వారి ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు.



ట్రాన్స్‌జెండర్ అంజలి

## నవంబర్ 17లోపు టెన్త్ వార్షిక ఫీజు గడువు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 3 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నవంబర్ 17లోపు అపరాధ రుసుము లేకుండా వార్షిక పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డీఈవో రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి ఎం రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రూ. 50 ఫైన్‌లో డిసెంబర్ 1, రూ.200 ఫైన్‌తో డిసెంబర్ 11, రూ.500 ఫైన్‌తో డిసెంబర్ 20 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టులు, అంతకన్న తక్కువ సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిల్ అయిన వారు రూ.125 చెల్లించాలని తెలిపారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు రెగ్యులర్ ఫీజు రూ.125తో పాటు అదనంగా రూ.60 చెల్లించాలని, మొదటిసారి పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల వార్షికాదాయం పట్టణాల్లో రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేల లోపు ఉంటే వారికి ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.